వరి..తగ్గిన దిగుబడి!

- బోరు బావుల్లో అడుగంటిన నీరు
- పంటకు ఆశించిన తెగుళ్లు
- చివరకు పెట్టుబడి రాని పరిస్థితి
- ఆందోళన చెందుతున్న రైతన్నలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలో యాసంగిలో వరి సాగు చేసిన రైతులకు భారీ స్థాయిలో దిగుబడి తగ్గి నిరాశే మిగిలింది. పంట చేతికి వచ్చే సమయంలో భూగర్భ జలాలు తగ్గి బోర్లలో నీరు అడుగంటిపోయింది. దీనికి తోడు పంటలపై చీడపీడలు ఆశించడంతో సగంలో సగం పంట మాత్రమే చేతికొస్తున్న పరిస్థితులు ప్రస్తుతం కనిపిస్తున్నాయి. దీంతో ఈసారి పెట్టుబడి రాక ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

18,500 ఎకరాల్లో సాగు..

జిల్లాలో వరి సాగుకు కొల్చారం మండలం పెట్టింది పేరు. బోర్లు ఎక్కువగా ఉండటం, మంజీరా నదిపై లిఫ్టులు, ఈ మధ్యకాలంలో నదిపై ఏర్పాటు చేసిన చెక్ డ్యాంలు ఉన్నాయి. దీంతో వరిని ఎక్కువగా సాగు చేశారు రైతులు. వానాకాలంలో వరి సాగు సాధారణ విస్తీర్ణం 20 వేల ఎకరాలు కాగా.. యాసంగిలో 18,500 ఎకరాల్లో సాగు చేశారు. మొదట్లో పచ్చగా కలకలాడుతూ వచ్చిన వరి పైరు..వేసవి మొదలైన నాటినుంచి ఇబ్బందులు వచ్చాయి. ఈసారి ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్ల జిల్లాలోనే అత్యధికంగా భూగర్భ జలాలు అడుగంటిన ప్రదేశాల్లో మండలం మొదటి స్థానంలో నిలిచింది. బోర్లలో నీరు అడుగంటి పంట చేతికి వచ్చే దశలో వెయ్యికి పైగా ఎకరాల్లో పూర్తిగా ఎండిపోయింది. దీనికి తోడు మెడ విరుపు(అగ్గి తెగులు)పంటను ఆశించడంతో పొలాల్లో ఎక్కడ చూసినా పొల్లుతో కూడిన వరి కంకులే దర్శనమిచ్చాయి. ప్రస్తుతం పంట కోతలు ఊపందుకున్నాయి. కల్లాల వద్దకు వద్దకు వరి ధాన్యాన్ని చేర్చారు. తూర్పార పడుతున్న సమయంలో మంచి ధాన్యం కంటే ఎక్కువ పొల్లు, తాలు వస్తుండటంతో దిగుబడి పూర్తిస్థాయిలో తగ్గిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో వ్యవసాయ అధికారులు మాత్రం యాసంగిలో రైతులు పంట మార్పిడి పై దృష్టి సారించినప్పుడే నష్టాలు తగ్గుతాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.


తుక్కాపూర్‌లో తెగుళ్లు ఆశించి దెబ్బతిన్న వరి పంట


వరి ధాన్యాన్ని తూర్పార పట్టగా వచ్చిన తాలు

పెట్టుబడి రాని పరిస్థితి



ఏటి అంచున 16 ఎకరాలు వరి సాగు చేశా. పైరుకు మెడ తిరుగుడు రోగం ఆశించడంతో 5 రోజుల్లోనే 10 ఎకరాల్లో 70 శాతం పంట దెబ్బతింది. దీంతో పెట్టుబడి రాక అప్పులే మిగిలాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

–సాయా గౌడ్, రైతు

12 ఎకరాల్లో ఎండిపోయింది



పంట మొదట్లో బోర్లు విస్తారంగా నీరు పోయడంతో వరి సాగు చేశా.గింజ పాలు తొడిగే సమయం వచ్చే సరికి బోర్లు అడుగుంటాయి. 12 ఎకరాల్లో పంట ఈసారి పూర్తిగా ఎండిపోయింది.పెట్టుబడి రాని పరిస్థితి వచ్చింది.

– బుచ్చమ్మ, రైతు, రంగంపేట

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

నిజాంపేట(మెదక్): నియోజకవర్గంలో గత పదేళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరుగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే సీసీ రోడ్లు, పాఠశాలలు, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, ఏడీఈ అదయ్య, డీఈ గరుత్మంతరాజు, ఏఈ గణేశ్, ఇతర కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ గ్రామంలో..

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బాలానగర్ గ్రామంలో రూ.2.82కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే రోహిత్ రావు గురువారం ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శంకర్, శ్రీనివాస్‌చౌదరి, ఏఈ రాజ్‌కుమార్, ఎంపీడీవో రఘు, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, కాంగ్రెస్ నాయకులు శంకర్, రమేశ్, నాగరాజు, కాట్రోత్ శివ, ఘట్టయ్య, లింగం ఉన్నారు.


సబ్ స్టేషన్‌కు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


కౌడిపల్లి: అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్

చిన్నశంకరంపేట(మెదక్): గర్భిణులతో పాటు బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ తెలిపారు. గురువారం మండలం భాగీర్థిపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనతను తగ్గించేందుకు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. గ్రామానికి చెందిన చూళ్ల పోశయ్య 25 కుర్చీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వరలక్ష్మి, శ్యామల పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట మండలంలో..

పెద్దశంకరంపేట(మెదక్): పోషణ్ పక్వాడాలో భాగంగా అంగన్‌వాడీ సెంటర్–9లో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు టీచర్ సరళ అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శుభ్రతతోనే ఆరోగ్యం..

కౌడిపల్లి(నర్సాపూర్): భోజనం చేసేముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, శుభ్రతతోనే ఆరోగ్యం బాగుంటుందని లబ్ధిదారులకు అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని భుజిరంపేట, వెంకటాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు మహేశ్వరీ, సద్గుణ, లక్ష్మి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఆహారంలో పాలు, ఆకుకూరలు, కోడిగుడ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.


చిన్నశంకరంపేట : అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ

క్లుప్తంగా

వరి కోసేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి


వరికోతలను పరిశీలిస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): హార్వెస్టర్‌తో వరి కోతలు కోసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ స్వప్న తెలిపారు. గురువారం మండలంలోని వెల్మకన్నలో వరి కోతలను పరిశీలించి హార్వెస్టర్ డ్రైవర్, యజమాని, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి కోసేటప్పుడు హార్వెస్టర్ ఆర్‌పీఎం 18 నుంచి 20లో ఉండేలా చూడాలన్నారు. రైతుల దాన్యాన్ని ఆరబెట్టి 17శాతం తేమ ఉండేలా చూడాలన్నారు. ధాన్యంలో మట్టిపెడ్డలు, పొల్లు లేకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాహితి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న వేదపండితులు

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. వేదపండితుల చేత గణపతి పూజ నిర్వహించి హోమాలు జరిపించారు. భక్తులతో ఆలయ ప్రాంతం కిటకిటలాడింది.అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి విఠల్ రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్‌లు శ్యాంరావు కులకర్ణి, రాధాకిషన్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ శ్రీధర్ గుప్తా, రామాగౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వినూత్న నిరసన


ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): గత నాలుగు నెలలుగా తమకు జీతాలు రావడం లేదని పంచాయతీ సఫాయి కార్మికులు గురువారం ఆకులు తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు రాకపోవడంతో పూట గడవడమే కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించి తమకు వేతనాలు అందించి ఆదుకోవాలని కోరారు.

గుండ్రెడ్డిపల్లి చెరువులోకి నీరు


నీటిని పరిశీలిస్తున్న గుండ్రెడ్డిపల్లి గ్రామస్తులు

తూప్రాన్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు చొరవతో రామాయంపేట కెనాల్ నుంచి గుండ్రెడ్డిపల్లి చెరువులోకి నీరు వచ్చి చేరుతోంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఉమ్మన్నగారి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గుండ్రెడ్డిపల్లి గ్రామస్తులు పరిశీలించారు. ప్రస్తుతం మల్కాపూర్ చెరువులోకి నీరు చేరిందని, రెండు రోజుల్లో గుండ్రెడ్డిపల్లి చెరువులోకి నీరు వస్తుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సేవాదళ్ కిష్టారెడ్డి, యాదిరెడ్డి, కృష్ణ, రాంరెడ్డి, రాములు, ఆంజనేయులు, మహేశ్, రమేశ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్యాడి క్లీనర్‌తో ధాన్యం శుభ్రం చేయాలి

ఆర్డీఓ రమాదేవి

హవేళిఘణాపూర్(మెదక్): వరి ధాన్యంను కష్టపడి ప్యాడి క్లీనర్‌తో శుభ్రం చేయడం ద్వారా రైతుకు లాభం వస్తుందని మెదక్ ఆర్డీఓ రమాదేవి అన్నారు. గురువారం మెదక్ మండలం శివ్వాయి పల్లి గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. రైతులు వరిధాన్యంలో తాలు లేకుండా చూస్తే తరుగు లేకుండా విక్రయించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెదక్ సహకారసంఘం చైర్మన్ హన్మంత్ రెడ్డి, డీఏఓ విన్సెంట్ వినయ్, ఏడీఏ విజయనిర్మల, ఏవో శ్రీనివాస్, ఆర్ఐ కిశోర్, ఏఈవో రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే సమాజంలో గుర్తింపు


ఎల్‌ఈడీ టీవీని అందజేస్తున్న నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉన్నత విద్యతోనే మనిషికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ బుచ్చనాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని ఉసిరికపల్లి ప్రాథమిక పాఠశాలకు మేడ్చల్ జిల్లా తుర్కపల్లిలోని జెనోటిక్ లేబరేటరీస్ లిమిటెడ్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఎల్ఈడీ టీవీ, ఫర్నిచర్, ఆట వస్తువులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్ గఫార్, మధుసూదన్‌రెడ్డి, నరసింహారెడ్డి మాట్లాడుతూ.. సీఎస్ఆర్ నిధుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పరిశ్రమ యాజమాన్యానికి గ్రామస్తులు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సాయిలత, తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం

వలు చోట్ల విద్యుత్‌కు అంతరాయం

రేగోడ్(మెదక్): మండలంలో గురువారం భారీ వర్షం పడింది. రేగోడ్‌తో పాటు ఆయా గ్రామాలు వర్షంతో తడిసి ముద్దయ్యాయి. కొండాపూర్‌లో విద్యుత్ తీగలపై ఓ చెట్టు విరిగి పడి సరఫరా నిలిచిపోవడంతో జగిర్యాల ఫీడర్ కింద ఉన్న గ్రామాలు కొండాపూర్, జగిర్యాల, ఆర్.ఇటిక్యాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే సరఫరాను పునరిద్ధరించారు. సింగోల్‌లో పలు కాలనీలకు సరఫరా నిలిచిపోయింది. ఉక్కపోత నుంచి కాస్త ఊరట లభించింది.

కొల్చారం మండలంలో...

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం గాలి దుమారంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోగా సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సంగాయిపేట సమీపంలో 11 కేవీ స్తంభం పైభాగం విరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన భారీ కటౌట్ కూలింది.పెద్దశంకరంపేట మండలంలోనూ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది.


రేగోడ్: విద్యుత్ తీగలపై విరిగి పడిన చెట్టు

రోడ్డు దిగితే అంతే..


చెర్లపల్లి శివారులో రోడ్డుపక్కన ఏర్పడిన భారీ గుంత

మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వెల్దుర్తి–శివ్వంపేట, ధర్మారం వెళ్లేదారిలో బీటీ రోడ్డు పక్కన మట్టి కొట్టుకుపోయింది. దీంతో అక్కడక్కడ పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించడానికి వాహనం రోడ్డు కిందకి దిగితే ప్రమాదం బారిన పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై సంబంధిత పంచాయతీరాజ్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరగక ముందే ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– వెల్దుర్తి(తూప్రాన్)

క్రికెట్ బ్యాట్లు వితరణ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని క్రీడాకారులకు వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి క్రికెట్ బ్యాట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో క్రికెట్ బ్యాట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, యువకులు ఉన్నారు.

ఖాతాలను హోల్డ్‌లో నుంచి తొలగించాలి

రేగోడ్(మెదక్): స్థానిక టీజీబీ బ్యాంకులో రైతుల ఖాతాలను హోల్డ్‌లో నుంచి తొలగించాలని పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.సర్దార్ కోరారు. కలెక్టర్, సంబంధిత బ్యాంకు ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేసినట్లు గురువారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న రైతు భరోసా, పీఎం కిసాన్ పెట్టుబడి సాయం డబ్బులు తీసుకోలేకపోతున్నారని, ఖాతాలను హోల్డ్‌లో పెట్టడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు విశ్వంశర్మ, రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం, ధ్వజారోహణం, రుద్రహోమం తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎస్ఆర్ఐ ప్రవీణ్ సహకారంతో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

కిరాణా డబ్బాలో చోరీ

నర్సాపూర్ రూరల్: కిరాణా డబ్బాలో చోరీ జరిగింది. ఈ ఘటన నర్సాపూర్ – మెదక్ జాతీయ రహదారిలోని పెద్ద చింతకుంట గేటు వద్ద చోటు చేసుకుంది. యజమాని వెంకటయ్య గౌడ్ కథనం ప్రకారం...కిరాణా డబ్బాను ధ్వంసం చేసి అందులోని కూల్ డ్రింక్స్, ఇతర సామగ్రిని సుమారు రూ.10వేల విలువైన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. గతంలో పలుమార్లు చోరీ జరిగిందని బాధితుడు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని బాధితుడు ఆరోపించాడు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాలలో ముప్పై ఏళ్ల క్రితం పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1995–96 పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులందరూ కలువడంతో పాటు, అప్పటి గురువులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయుల బోధనలు, ప్రయోజకులుగా మార్చేందుకు ఇచ్చిన సలహాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లక్ష్మీనారాయణ, ప్రభు, రమేష్, మురళీ గౌడ్, శ్రీనివాస్, యదుల్లా, ప్రవీణ్, కవిత, భాగ్యలక్ష్మి, సునీత, శైలజ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎండిన వరి.. పశువులకు మేత


ఎండిన పంట చేనును మేస్తున్న పశువులు

బోరు బావుల్లో భూగర్భ జలాలు తగ్గడంతో వరి పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు సైతం నష్టపోతున్నామని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కాట్రియాల తండాలో బాల్యానాయక్ అనే రైతుకు సంబంధించి నాలుగు ఎకరాల వరిపంట నీరందక ఎండిపోయింది. దీంతో ఎండిన వరి చేనులో పశువులను మేపుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని సదరు రైతు విజ్ఞప్తి చేశారు.

– రామాయంపేట(మెదక్)

సంక్షిప్త వార్తలు

అంగన్వాడీకి ఫ్యాన్ బహూకరణ

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఉన్న అంగన్వాడీ కేంద్రానికి ఎస్ఆర్ఐ చంద్రశేఖర్ గురువారం ఫ్యాన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల కోసం ఫ్యాన్‌ను అంగన్వాడీ టీచర్ జ్యోతికి అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామనాయకులు స్వామి, లింగం, నవీన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పెద్దశంకరంపేట(మెదక్): మండల నూతన ఈజీఎస్ ఏపీఓగా సంతోష్‌కుమార్ నియమితులయ్యారు. పాపన్నపేటలో ఏపీఓగా పనిచేస్తున్న ఆయన పెద్దశంకరంపేట రెగ్యులర్ ఏపీఓగా నియమితులయ్యారు. ఇక్కడ ఇప్పటి వరకు ఈసీ నవాజుద్దిన్ ఇన్‌చార్జి ఏపీఓగా కొనసాగుతున్నారు. గురువారం ఇన్‌చార్జి ఎంపీడీఓ విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

చేగుంట(తూప్రాన్): ఈదురు గాలులతో రెండు రోజులుగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది రెండు రోజుల నుంచి విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నారు. మండల కేంద్రమైన చేగుంటలో విద్యుత్ తీగలు తెగిపోయే అవకాశం ఉన్నచోట తీగలను సరి చేస్తున్నారు. ఈదురుగాలులతో వర్షాలు వస్తున్నందున ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు సిబ్బంది తెలిపారు.

ధరల పెంపుపై నిరసన

నర్సాపూర్: వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్‌కు పెంచిన ధరలను తగ్గించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. ఆయన గురువారం మాట్లాడుతూ వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50, పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని విధించడం విచారకరమన్నారు. వంట గ్యాస్ ధర పెంచి పేదలపై ఆర్థిక భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు.

గాయపడిన కార్మికుడిని ఆదుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమలో పని చేస్తూ గాయపడిన కార్మికుడిని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన యువకుడు ముప్పిరెడ్డిపల్లి శివారులో గల తోటకోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ పరిశ్రమలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. ఫిబ్రవరి 19న పరిశ్రమలో మిషన్‌లో కుడిచెయ్యి పడి వేళ్లు కట్ అయ్యాయని తెలిపారు. కాగా అతనికి యాజమాన్యం మెరుగైన వైద్యం అందించలేదన్నారు. పరిహారంతో పాటు పరిశ్రమపై లేబర్ కమిషనర్ చర్యలు తీసుకోవాలన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకే పాదయాత్ర

చిన్నశంకరంపేట(మెదక్): రాజ్యాంగ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న జైబాపు – జైభీమ్ – జై సంవిధాన్ పాదయాత్రలో కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని నార్సింగి మండల కాంగ్రెస్ సమన్వయకర్త జూకంటి రాజాగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలోని రెడ్డి సంఘం భవనంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, బాల్‌రాజ్ గౌడ్, రాజేశ్, రాజేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామీణ స్థాయిలో బీజేపీ బలోపేతం నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితోనే సాధ్యమవుతుందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గోడ రాజేందర్ అన్నారు. గురువారం ఆయన పార్టీ మండల అధ్యక్షుడు నాగేష్‌యాదవ్‌తో కలిసి చిలప్‌చెడ్‌లో నాయకులతో సభ్యత్వ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణగౌడ్, కమిటీ సభ్యుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రామకృష్ణ, మహిపాల్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో అటెండర్ మృతి

శివ్వంపేట(నర్సాపూర్): గుండెపోటుతో ఆలయ అటెండర్ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చిన్న గొట్టిముక్లలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పానుగంటి నర్సింహులు(48) చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఆలయం వద్ద విధులు ముగించుకొని ఇంటికి వచ్చిన అనంతరం అర్ధరాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు నర్సాపూర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. అంత్యక్రియల కోసం బాధిత కుటుంబానికి దేవాదాయ శాఖ నుంచి ఈఓ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు.